క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రొద్దం: మండలంలోని ఎం.కొత్తపల్లి, మోపర్లపల్లిలో శనివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చింత చెట్ల వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయతీలోని చింత చెట్లకు శుక్రవారం గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ రంగనాథ్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. వ్యాపారి తిమ్మప్ప రూ.26 వేలకు చింత చెట్లను దక్కించుకున్నారని ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శి మల్లికార్జున తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

రొద్దం: చెరుకూరు గ్రామంలో చేపడుతున్న గ్రామీణ ఉపాధి పనులను డ్వామా ఏపీడీ జయసింహ శుక్రవారం పరిశీలించారు. పనులపై కూలీలతో ఆరాతీశారు. కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పనులు నాణ్యతగా, రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

రొద్దం: మండలంలోని చోళేమర్రికి చెందిన మాజీ సర్పంచ్ గొందిపల్లి రామన్న శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు రవిశేఖర్‌రెడ్డి, కొండలరాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పాదయాత్ర బృందం

పరిగి: మండల కేంద్రంలోని తొంబై ఇళ్ల ఎస్సీ కాలనీ నుంచి చేపట్టిన పాదయాత్ర బృందం గోరంట్ల మండలంలోని పూలచెట్లపల్లి వద్ద ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం కలిసింది. పరిగి నుంచి 35 మంది భక్తులు ఎస్సీ సెల్ మండల నాయకుడు శివశంకర్ నేతృత్వంలో కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి పాదయాత్రగా బయల్దేరారు. భక్తులకు ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ శ్రేణులు కల్పించారు. శనివారం ఖాద్రీ నృసింహుడిని దర్శించుకోనున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


హిందూపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీమిరెడ్డి అంజన్‌రెడ్డి, హిందూపురం మున్సిపల్, సచివాలయ ఎంప్లాయీస్ టీచర్స్‌అండ్ వర్కర్స్ సంఘం జేఏసీ అధ్యక్షుడు బండి ఆనంద్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు సిరాలచంద్ర ఆ సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్, పట్టణ కమిటీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం

హిందూపురం: ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ రక్షణ కవచంగా నిలుస్తుందని వాహనం నడిపే సమయంలో తప్పక ధరించాలని ఆర్టీఓ కరుణాకర్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రతావారోత్సవాలలో భాగంగా శుక్రవారం పోలీసులు, కార్యదర్శులు, ఎంవీఐ సిబ్బంది, వాహనదారులతో కలిసి భారీ బైక్, కారు ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో స్కూల్, కళాశాల బస్సు డ్రైవర్లు కండక్టర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు.

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డీఎస్పీ హుసేన్ పీరా తెలిపారు. కియా అనుబంధ పరిశ్రమ ఎన్విహెచ్‌లో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. సీఐ కరుణాకర్, కియా ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది హాజరయ్యారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి భారీ విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

లేపాక్షి: లేపాక్షి ఆలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి హిందూపురానికి చెందిన నారాయణరెడ్డి జ్ఞాపకార్థం భార్య అశ్వత్థమ్మ, కుమారుడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కూతురు సరస్వతమ్మ రూ.2,22,222 విరాళం శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలకు కమిటి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు గుర్రంకొండ నాగగలక్ష్మమ్మ. గోరంట్ల మండలంలోని కోరేవాండ్లపల్లి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఈమె కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.2,58,953 లబ్ధి చేకూరింది. వైఎస్ఆర్ ఆసరా రూ.53,958 వైఎస్సార్ రైతు భరోసా రూ.40,500, వైఎస్సార్ చేయూత రూ.37,500 వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.12,187, వైఎస్సార్ పింఛను కానుక రూ.1లక్షా 7 వేలు, పంటల బీమా కింద రూ.7,808 లబ్ధి పొందారు. సీఎం వైఎస్ జగనన్న మేలును ఎప్పటికీ మరిచిపోలేమని, మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని నాగలక్ష్మమ్మ అన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సరస్వతి.ఈమెది చిలమత్తూరు మండలం చాగలేరు పంచాయతీలోని పోతులప్పపల్లి గ్రామం. ఈమెకు వైఎస్సార్ రైతు భరోసా రూ.40,500, వైఎస్సార్ ఆసరా రూ.15,156, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.2,109, జగనన్న అమ్మ ఒడి రూ.42,000 లబ్ధి చేకూరింది. ఈ పథకాలే కాకుండా మా కుటుంబంలో ఇద్దరికి వికలాంగ పింఛన్లు, ఒక వృద్ధాప్య పింఛను అందుతోందని, మూడున్నరేళ్ల కాలంలో తమ కుటుంబానికి రూ.5 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని ఆమె సంతోషం వ్యక్తం చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆమె తెలిపారు.



గోరంట్ల: సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ



చిలమత్తూరు: పోతులప్పపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

- ఎమ్మెల్యే శంకర నారాయణ, ఎమ్మెల్సీ ఇక్బాల్
- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన

గోరంట్ల (సోమందేపల్లి): అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మలసముద్రం, పూలచెట్లపల్లి, కోరేవాండ్లపల్లి గ్రామాల్లో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ, సంక్షేమ పథకాల బ్రోచర్లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేశామన్నారు. పక్కా గృహాలు, వైఎస్సార్ పింఛను కానుక, అమ్మ ఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, చేయూత, నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధితో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మాజీ కన్వీనర్ ఫకృద్దీన్, జెడ్పీటీసీ జయరాం నాయక్, నారాయణ, ఎంపీపీ ప్రమీళ, సింగిల్ విండో చైర్మన్లు శంకర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఏహెచ్ బాషా, వైస్ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణు గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ నూర్, అగ్రిబోర్డ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు బయ్యప్ప రెడ్డి, రఘునాథ్ రెడ్డి, సత్తి, సమర జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం..

చిలమత్తూరు: ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధి వైపు దృష్టి సారించారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని చాగలేరు పంచాయతీ పోతులప్పపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' ప్రారంభించారు. ఆయన పెద్దరెడ్డిపల్లి, మోతుకపల్లి, శానిగానిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. పోతులప్పపల్లిలో ఆయన వైఎస్సార్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాము సంక్షేమం, అభివృద్ధి వైపు వెళుతుంటే ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఇలాంటి వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా పనికిరారన్నారు. చంద్రబాబుకు వయసైపోయిందని, అందుకే పిచ్చి పిచ్చిగా అవాకులు, చెవాకులు పేలుతున్నాడన్నారు. లోకేష్ పాదయాత్ర వృథా ప్రయాస అవుతుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం మరువపల్లిలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి రూ.20 వేలు వితరణ చేశారు..కార్యక్రమంలో సర్పంచ్ జయలలిత, వైస్ ఎంపీపీ బయప్ప, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, ఆర్ఐ దుర్గేష్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఏఈ లు రాజేంద్ర ప్రసాద్, వేణు,నారాయణస్వామి, ఏఓ వంశీకృష్ణ, సచివాలయ ఉద్యోగులు ఏఎన్‌ఎం రేణుక, గోవర్ధన్, స్థానిక నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక సీఎం జగన్



బ్రహ్మేశ్వరంపల్లిలో 'ప్రజలతో మమేకం' కార్యక్రమంలో పాల్గొన్న చౌళూరు మధుమతి

చిలమత్తూరు: ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతి అన్నారు. శుక్రవారం మండలంలోని దేమకేతేపల్లి పంచాయితీలోని కొర్లకుంట, బ్రహ్మేశ్వరంపల్లి, డి.గొల్లపల్లి గ్రామాల్లో ఆమె ' ప్రజలతో మమేకం' కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అందించారన్నారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థల ద్వారా సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేశారన్నారు. టీడీపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అయినా ఎక్కడా పక్షపాతం చూపకుండా అభివృద్ధి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పురంపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని, అందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఆదర్శ్, అయూబ్, నాగరాజు స్వామి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకా వ్యాప్తంగా కాంగ్రెస్ హయాంలోనే అనేక అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే వెంకటరమణప్ప తెలిపారు. స్థానిక 7వ వార్డు రైన్‌గేజ్ ఎక్స్‌టెన్షన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగలమడక ఉత్తర పినాకిని నది నుంచి పైపుల ద్వారా పట్టణంలోని చాకలి కుంటకు నీటిని తరలించి పట్టణ వాసుల దాహార్తి తీర్చామన్నారు. పట్టణ పరిధిలో నగరాభివృద్ధి పథకం కింద రూ.13 కోట్లతో మొత్తం 23 వార్డులలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే స్థానిక విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమ అభివృద్ధి పనులే కాంగ్రెస్ పార్టీ గెలుపునకు శ్రీరామ రక్ష అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు శశికళ, ముఖ్యాధికారి జగరెడ్డి, కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, రాజేశ్, సుదేశ్ బాబు, గుట్ట హళ్ళి అంజినప్ప, శంకరరెడ్డి, టిప్పు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని డీ1 ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగించడంలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ ఏఈ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, బీఎస్టీ పెట్రోల్ బంక్ ఏరియా, ఆబాద్‌పేట, ముక్కడిపేట, ధర్మపురం, నానెప్పనగర్, లక్ష్మీపురం, డీబీ కాలనీ, డీఆర్ కాలనీ, శ్రీకంఠపురం, మోడల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హిందూపురం టౌన్: మండలంలోని తూకుంట, రాచపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ డీఈఈ నాగన్న శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



డాక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్కతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఎంతమంది రోగులు రోజూ ఓపీకి వస్తున్నారు? మందులు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని సూచించారు. రోగులు వచ్చినా ఆసుపత్రిలో సిబ్బంది ఉండటం లేదని రోగులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'జగనన్న గోరు ముద్ద పథకం' ద్వారా నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆవినకుంట గ్రామం వద్ద గల కేజీబీవీ, రొళ్ల హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని సూచించారు. క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. తర్వాత వంట గది, మరుగుదొడ్లతో పాటు పాఠశాల గదులను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మున్వార్‌జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని దేవగానపల్లి, నగోనపల్లి గ్రామాల్లోని పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మెనూ మార్పిందన్నారు. సోమవారం నుంచి శనివారం వరకూ ప్రతి రోజు వంట ఏజెన్సీలు ఏమి వండాలో, విద్యార్థులకు ఏలాంటి ఆహారాన్ని అందించాలో తెలియజేశారు. ఎవరైనా సక్రమంగా భోజనాన్ని అందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆంగ్ల విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు చదవడం, రాయడం, గుర్తించడం తదితర వాటిలో తర్ఫీదు ఇవ్వాలని కోరారు.

ప్రత్యేక హోదా కోసం యాత్ర కొనసాగిస్తాం

హిందూపురం టౌన్: విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం చేపట్టిన యాత్రను కొనసాగిస్తామని సీపీఎం నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. ప్రత్యేక హోదా కోసం చేపట్టిన యాత్రను అడ్డుకోవడంపై శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రత్యేక హోదా సాధన కోసం తాము చేపట్టిన బస్సు యాత్రను ఆపే ప్రసక్తే లేదన్నారు. హిందూపురం నుంచి విజయవాడకు చేపట్టబోయే బస్సు యాత్రకు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మద్దతు తెలపాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, విద్యార్థి యువజన సంఘాల నాయకులు బాబావలి పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయిలో చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆనంతరం కలశస్థాపన, హోమం, పూర్ణాహుతి తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుడిబండ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి గుడిబండ మార్కెట్ కమిటీ సభ్యులు శుక్రవారం రూ.20,001 విరాళాన్ని గురుస్వాములు రాజన్న, రాజుకు అందించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తుల తరపున మార్కెట్ కమిటీ సభ్యులకు గురుస్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గుండె వైద్య శిబిరం

రొద్దం: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూప ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ముగ్గురు మట్కా బీటర్ల అరెస్టు

హిందూపురం: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసి, వారి నుంచి మట్కా చీటీలతోపాటు రూ.38,480 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. అహమ్మద్ నగర్‌లోని జాబీవుల్లాను అరెస్టు చేసి 13 మట్కా స్లిప్పులు, ఒక సెల్ ఫోనుతోపాటు రూ.6,500 స్వాధీనం చేసుకున్నారు. అలాగే హస్నాబాద్‌లోని చికెన్ రియాజ్‌ను వద్ద 11 స్లిప్పులు, సెల్‌ఫోన్, రూ.8,300, కొట్నూర్ నాగభూషణం నుంచి సెల్‌ఫోన్, 16 స్లిప్పులు, రూ.23,600 స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ శంకర్, పోతులయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేస్తాం

పావగడ: వచ్చే స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగుర వేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు రవిశంకరనాయక్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21 నుంచి 29 వరకు తాలూకా వ్యాప్తంగా నిర్వహించే విజయ సంకల్ప అభియాన కార్యక్రమంలో బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సీనియర్ నేత వెంకట్రామయ్య మాట్లాడుతూ నరేంద్ర మోదీ విశ్వ నాయకుడని, శత్రు దేశాలు సైతం నరేంద్ర మోదీ పరిపాలనను ప్రశంసిస్తున్నాయన్నారు.కార్యక్రమంలో నాయకులు సాకేల్ శివకుమార్, హనుమంతరాయప్ప, లాయర్ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

పావగడ: తాలూకాలోని బి హొసహళ్ళి, పోలేనహళ్ళి గ్రామాల్లో శుక్రవారం ప్రజాకవి, మహాయోగి రెడ్డి వేమన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు వీఎన్ రెడ్డిని స్థానిక రెడ్డి జనసంఘం పదాధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో తాలూకా రెడ్డి జనసంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడు ధనుంజయరెడ్డి, చింతలరెడ్డి తదితర పదాధికారులు పాల్గొన్నారు.

రూ.399కే రూ.10 లక్షల బీమా

అమరాపురం: తపాల శాఖ వినూత్న రీతిలో టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ సౌజన్యంతో పేద బడుగు, బలహీన వర్గాలకు కూలీలకు ఉపయోగపడేలా రూ.399కే బీమా పాలసీ తీసుకొచ్చింది. శుక్రవారం అమరాపురం బస్టాండ్‌లో రూ.399కే బీమా కార్యక్రమాన్ని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ నాయక్, ఐపీబీపీ బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాద బీమా పాలసీ 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల్లోపు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. పాలసీ సంవత్సర కాలం పాటు అమలులో ఉంటుందని, సంవత్సరంలోపు ఎలాంటి ప్రమాదం జరిగినారూ.10 లక్షల కవరేజీ ఉంటుందన్నారు. ఈ పాలసీ తీసుకోవాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ఖాతా లేని వారు కొత్తగా రూ.200 చెల్లించి ఖాతా ప్రారంభించుకోవచ్చని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీడీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు

మడకశిరరూరల్: టీడీపీ నాయకుల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం హరేసముద్రం సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ నరసింహమూర్తి, మండల ఎస్సీ సెల్ నాయకుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రజలను మభ్యపెట్టడానికే అసత్య ప్రచారాలను చేస్తున్నారని ఆరోపించారు. సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ ద్వారా ఉచితంగా బోర్లు వేస్తున్న విషయం టీడీపీ నాయకులకు కనిపించలేదన్నారు. ఇదేం ఖర్మ కేవలం టీడీపీ నాయకులకు మాత్రమేనన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని హితువు పలికారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మడకశిర రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. శుక్రవారం బుళ్లసముద్రంలో కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, దోమల నివారణ తదితర వాటిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని ప్రజలకు వివరించారు.మురుగు నీరు రోడ్డుపైకి వదలకుండా గుంతలు తవ్వుకోవాలని ఎస్ఐ నాగేంద్ర సూచించారు. అనంతరం మురుగు గుంతలు, కాలువలను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. సర్పంచ్ రంగమ్మ, డాక్టర్ వినోద్‌కుమార్, కార్యదర్శి మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

గడువులోపు లక్ష్యం పూర్తి చేయండి

పెనుకొండ: గడువులోపు నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని శ్రీసత్యసాయి జిల్లా ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో ఆయనతో పాటు సూపరింటెండెంట్ వరప్రసాద్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీడీ మాట్లాడుతూ 2023 ఆర్థిక సంవత్సరానికి ఏపీఎంఐపీ ద్వారా రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు 26 కంపెనీల ద్వారా సబ్సిడీతో సరఫరా చేస్తున్న తరుణంలో టార్గెట్లను సిబ్బంది అనుకున్న సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రైతులకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

దివ్యాంగులకు ఉచిత శస్త్ర చికిత్స

పావగడ: కుష్టు వ్యాధితో అవయవాలు కోల్పోయిన దివ్యాంగులకు స్థానిక వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పునర్ చేతన శస్త్ర చికిత్స (రికన్‌స్ట్రక్టివ్ సర్జరీ) నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య కేంద్రం నిర్వాహకుడు స్వామి జపానంద శుక్రవారం తెలిపారు. ఇప్పటికే శస్త్ర చికిత్స చేయించుకున్న 12 మంది రోగులు డిశ్చార్జి అయినట్లు పేర్కొన్నారు. కర్ణాటకలోనే రికన్‌స్ట్రక్టివ్ సర్జరీ అందిస్తున్న ఏకైక ఆరోగ్య కేంద్రం తమదేనని చెప్పారు. ఈ ఘనత ఇన్ఫోసిస్ ఫౌండేషన్, డేమియన్ ఫౌండేషన్‌కు చెందుతున్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పరిగి విద్యార్థులు

పరిగి: పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజు, పీడీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఫుట్బాల్ పోటీల్లో పాఠశాల తరపున ఎనిమిదో తరగతి విద్యార్థులు ప్రణవిక, తేజు, 9వ తరగతి విద్యార్థి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారన్నారు. ఫుట్‌బాల్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 22 వరకూ పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో అండర్-14 విభాగంలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

పారదర్శకంగా పథకాలు వర్తింపజేయండి

పరిగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బీచిగానిపల్లి, ఊటుకూరు, పరిగి-1, పరిగి-2 సచివాలయ పరిధిలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ సరస్వతి, ఈఓఆర్డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

రొద్దం: మండల కేంద్రంలో కొంత కాలంగా నెలకొన్న వివాదాస్పద స్థలాన్ని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓర్డీ కేశవరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరూ ఆక్రమించరాదన్నారు. పంచాయతీ స్థలంలో ఇద్దరి మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ మారుతీరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పై బోల్తాపడిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. హైదరాబాద్ వైపు నుంచి బెంగళూరు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువ వైపు దూసుకు వెళ్లింది. డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అమరాపురం: గ్రామ సచివాలయంలోని ఉద్యోగులు ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి కోరారు. శుక్రవారం హలుకూరు, హేమావతి సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రిజిష్టర్‌లను పరిశీలించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రభుత్వ సేవలను సకాలంలో ప్రజలకు అందించాలన్నారు. ప్రస్తుతం సచివాలయాల పరిధిలో చిన్నారులకు ఆధార్‌కార్డు కొత్తగా తీస్తున్నారని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726